# బాదరాయణ సంబంధం

లంచ్ టైమ్‌లో వచ్చి నా ముందు కూర్చున్నాడు మైక్. అలవాటు ప్రకారం నా దగ్గర ఒక ఇడ్లీ తీసుకుని తిని, "చాల బాగుంది" అన్నాడు.

"అయితే - నిన్నా, మొన్నా ఆఫీస్ మానేశావ్ కదా - ఏంచేశావ్?" అడిగాను.

" ఓ - నీకు చెప్పలేదు కదూ - సిండీ వచ్చింది డల్లాస్ నించీ!" అన్నాడు.

కొంచెం ఆగి నవ్వాడు "సిండీ ఎవరో నీకు తెలీదు కదూ - నా మూడవ భార్య. విడాకుల తర్వాత మొదటిసారి ఇక్కడకు రావటం. ఆమెతోపాటు మార్క్ కూడా వచ్చాడు!" ★ ★ ★

"మార్క్ అంటే మీ అబ్బాయి కదూ!" అడిగాను.

"కాదు - మా అబ్బాయి జో. నా దగ్గర వుంటాడు. మార్క్ అంటే సిండీ కొడుకు - సిండీ - మెలినాస్కీల పిల్లవాడన్నమాట. మార్క్ సిండీ దగ్గరకు వచ్చాడట, రెండు రోజులు వాళ్ల నాన్నని వదిలిపెట్టి. ఇక్కడకు తనతో తీసుకువచ్చింది."

"అవును! ఇక్కడకు వస్తే "జో"తో ఆడుకోవచ్చు కదా!" అన్నాను.

"జో ఇక్కడ లేదు - జెన్నీ వాళ్లింటికి వెళ్ళాడు శలవలకు. జెన్నీ అంటే నా రెండవ భార్య. వాళ్లబ్బాయి రాల్ఫ్‌కీ, వీడికీ మంచి స్నేహం. కానీ నా భయం ఏమిటంటే, మార్క్‌కీ, జాకీకీ ఒక క్షణం పడదు. ఎప్పుడూ కొట్టుకుంటారు!"

"జాకీ ఎవరు?" అడిగాను.

"నీకు తెలీదు కదూ - ఐ యామ్ సారీ - నా మొదటి భార్య ఎలిజాకి కూతురు. వాళ్ల నాన్న మార్టిన్ వేరే వెళ్లిపోయిన దగ్గరనించీ నాతోనే వుంటున్నది!"

ఈ గందరగోళంతో ఇడ్లీ గొంతులో అడ్డంపడి కొరపోయింది.

మైక్ మాత్రం సీరియస్‌గా చెబుతున్నాడు.

"కానీ జాకీకి డానీ అంటే ఇష్టం!"

డానీ ఎవరు అని అడగటానికి, ధైర్యం చాల్లేదు నాకు.

ఈ బాదరాయణ సంబంధంతో నా బుర్ర అప్పటికే నూట ఎనభై డిగ్రీలు తిరిగిపోయింది.